క్లుప్తంగా

149వ రోజుకు చేరిన 'జిల్లా' దీక్షలు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌ను జిల్లాగా ఏర్పాటు చేయాలని బోధన్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు మంగళవారానికి 149 రోజులకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఆటో యూనియన్ డ్రైవర్లు అబ్దుల్ రహీం, మహ్మద్ ఇబ్రహీంలు కూర్చున్నారు. ఈ దీక్షలను బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు గంగారెడ్డి, సీనియర్ న్యాయవాది హన్మంత్‌రావ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అన్ని అర్హతలున్న బోధన్‌ను జిల్లాగా ఏర్పాటు చేయాలని 149 రోజులుగా దీక్షలు చేస్తున్నా, ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని, బోధన్‌ను జిల్లాగా ప్రకటించేంత వరకు దీక్షలను కొనసాగిస్తామన్నారు. న్యాయవాదులు శంకర్, నాయక్ సాయిలు, బానోత్ రమేష్, అజయ్ ఉన్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

మాక్లూర్: మాణిక్‌భండార్, మాక్లూర్‌లలో మద్యం దుకాణాలను మంగళవారం ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేశారు. ఇటీవల ఫుల్ బాటిల్ లిక్కర్‌పై ప్రభుత్వం రూ.40 తగ్గించింది. కొన్ని మద్యం దుకాణాల్లో తగ్గించి అమ్మకుండా పాత రేటుకే విక్రయిస్తున్నారనే ఫిర్యాదుల మేరకు అధికారులు మద్యం దుకాణాల్లో తనిఖీలు చేసినట్టు తెలుస్తోంది. దుకాణంలో ప్రస్తుతం నిల్వ ఉన్న పాత స్టాక్ పూర్తయ్యే వరకు అదే ధరకు విక్రయించుకోవచ్చన్నారు. కొత్త స్టాక్‌పై పాత ధర వసూలు చేయరాదని, అలా ఎవరైనా చేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు. మోర్తాడ్ ఎక్సైజ్ సీఐ గుండప్ప ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



బోధన్ రూరల్ (బోధన్): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 17 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎంపీపీ బుద్దె సావిత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల రైతు బంధు మాజీ కో–ఆర్డినేటర్ బుద్దె రాజేశ్వర్, బీఆర్‌ఎస్ బోధన్ మండల అధ్యక్షుడు సంజీవ్ కుమార్, సర్పంచ్‌లు గుండారం శంకర్, లక్ష్మి, నాయకులు సర్సారెడ్డి, మేడి రవి, షాకీర్ పటేల్, కల్లూరు లక్ష్మణ్, భవానిపేట్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ పరిధిలో..

బాల్కొండ: మూడు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. నాయకులు విద్యాసాగర్, కిషన్, ప్రసాద్, సాగర్‌యాదవ్, బాలరాజు, షాహిద్, వాహబ్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పరీక్షలు చేయించుకోవాలి

ఆర్మూర్‌టౌన్: మహిళలు ఎప్పటికప్పుడు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి ఎటువంటి ఆరోగ్య సమస్య వచ్చినా వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ అయేషా, మానసలు అన్నారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 138 మంది మహిళలకు పరీక్షలు చేసి మందులు అందజేశారు.

గ్రామ సంఘాల ఆడిటింగ్

మోర్తాడ్: మండలంలోని గ్రామ సంఘాల 2022–23 ఆర్థిక సంవత్సరం ఆడిటింగ్‌ను మంగళవారం ప్రారంభించారు. చార్టెడ్ అకౌంటెంట్ ఆడిటర్లు గ్రామ సంఘాల ఆర్థిక లావాదేవిలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రమీల, సీబీవో ఆడిటర్ భోజన్న, సీసీలు తడకల శ్రీనివాస్, ఈర్నాల రాజేశ్వర్, మహేందర్, గాజుల శ్రీనివాస్, మండల అకౌంటెంట్ మోహన్, కంప్యూటర్ ఆపరేటర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



డొంకేశ్వర్(ఆర్మూర్): మండల పరిధిలోని బీజేపీకి చెందిన దత్తాపూర్, నికాల్‌పూర్ ఎంపీటీసీ బానోత్ గంగాదేవీ, ఆమె భర్త మహేశ్ బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డిని కలిసి పార్టీ కండువాను కప్పుకున్నారు. ఎంపీటీసీతో పాటు పలువురు బీజేపీ కార్యకర్తలు కూడా బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

కంటి శిబిరం ప్రారంభం

డొంకేశ్వర్(ఆర్మూర్): సిర్పూర్‌లో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ లత ప్రారంభించారు. 5 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి విఘ్నేష్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే ఏడాదీ అనుమానమే?

- ముప్కాల్ మండల కేంద్రంలో నత్తనడకన సాగుతున్న కేజీబీవీ భవన నిర్మాణం
- రెండేళ్లు గడిచినా పనులు పూర్తి కాని వైనం
- చినుకు పడితే పనులు బంద్



నిలిచిపోయిన కేజీబీవీ పాఠశాల భవనం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని నిర్మిస్తున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ(కేజీబీవీ) నూతన భవనం వచ్చే విద్యా సంవత్సరం (2023–24) కూడా పూర్తి కావడం అనుమానంగానే ఉంది. పది రోజుల నుంచి భవన నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. నూతన మండలాల ఏర్పాటులో భాగంగా 2016లో ముప్కాల్ మండల కేంద్రంగా ఏర్పడింది. 2017–18 విద్యా సంవత్సరం నుంచి మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలను ప్రారంభించారు, కాని భవనం లేకపోవడంతో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. తరువాత భవన నిర్మాణానికి రూ.3.5 కోట్ల నిధులు మంజూరు చేశారు. 2021 జనవరి నెలలో భవన నిర్మాణానికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసిన చాలా రోజుల తరువాత పనులు ప్రారంభించారు. గతంలో భవన స్లాబ్ పనులు పూర్తి కాగానే బిల్లులు రాక కాంట్రాక్టర్ పనులను నిలిపి వేశారు. రెండు నెలల క్రితం నుంచి మళ్లీ పనులు ప్రారంభించారు. పై అంతస్తు స్లాబ్ వేశారు. వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల వల్ల పనులు మళ్లీ నిలిచి పోయాయి. పాఠశాల భవనం కోసం గ్రామానికి చెందిన ఒకరు స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. ఆ స్థలం పంట పొలాల నడుమన ఉంది. అక్కడి వరకు సరైన రోడ్డు లేకపోవడంతో చినుకు పడితే భవనం వరకు వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో భవన సామగ్రి తీసుకురావడానికి ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం ఇసుక లేకపోవడంతో నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ఇసుక వాహనాలు భవనం వద్దకు రావడానికి అనువుగా లేదు. దీంతో కాంట్రాక్టర్ పనులనే నిలిపి వేశాడు. మరో నెల రోజులు అయితే నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతుంది. కాని పనులు మరో ఏడాది అయినా పూర్తయ్యేలా కనిపించడం లేదు.

అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాల..

కేజీబీవీ పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతుంది. దీంతో విద్యార్థులకు సరైన సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాలికల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ఉన్నత అధికారులు నూతన భవనం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

పనులను వేగవంతం చేస్తాం

కేజీబీవీ పాఠశాల భవన నిర్మాణ పనులను వేగవంతం చేస్తాం. భవన నిర్మాణ సామగ్రిని భవనం వద్దకు తీసుకురావడం ఇబ్బందిగా ఉందని పనులు నిలిచిపోయాయి. ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేసి పనులను ప్రారంభిస్తాం.

– శ్రీనివాస్, ఆర్‌ఎంఎస్, ఏఈ

తిరుగులేని ముఖ్యమంత్రి కేసీఆర్

- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి



సర్పంచ్‌లు, నేతలతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): తెలంగాణ రాష్ట్రంలో అట్టడుగు వర్గాల కుటుంబాల్లో వెలుగులు నింపడానికి సీఎం కేసీఆర్ 450 పథకాలను అమలు చేస్తూ దేశంలోనే తిరుగులేని ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టిస్తున్నారని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంగళవారం ఆర్మూర్ మండల అధికారులు, సర్పంచ్‌లు, ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల సర్వతోముఖాభివృద్ధే దేశాభివృద్ధికి కొలమానంగా సీఎం కేసీఆర్ తెలంగాణలోని ప్రతి పల్లెలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తున్నారన్నారు. సర్పంచ్‌లు, నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. తహసీల్దార్ వేణుగోపాల్ గౌడ్, ఎంపీడీవో శ్రీనివాస్, సర్పంచ్‌లు ఆసపురం దేవి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్

బోధన్‌టౌన్(బోధన్): తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాయలంలో మంగళవారం ఆయన మాట్లాడారు. రైతు బంధు, రైతు బీమా పథకాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి 5 సంవత్సరాలు పూర్తయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని తెలిపారు. రైతు సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాలు అమలు చేయడానికి పూనుకున్నాయన్నారు. సమావేశంలో రైతు విభాగం పట్టణ అధ్యక్షులు నక్క లింగారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు మహ్మద్ పాషా పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య



అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య అన్నారు. ఆర్మూర్ పట్టణంతో పాటు పిప్రి గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు పదో తరగతి పాసైన విద్యార్థులను కళాశాలలో చేర్పించడానికి ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించారు. విద్యార్థిని, విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ స్కాలర్ షిప్ సౌకర్యం, హాస్టల్ వసతి, అనుభవం కల్గిన అధ్యాపకులతో బోధన ఉంటుందని తెలిపారు. అధ్యాపకులు, చంద్రశేఖర్, గంగాధర్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

గరం గరంగా కొత్తపల్లి విండో మహాజన సభ



మాట్లాడుతున్న విండో చైర్మన్ సునీల్ కుమార్

రుద్రూర్: కోటగిరి మండలం కొత్తపల్లి సింగిల్ విండో మహాజన సభ గరంగరంగా సాగింది. మంగళవారం విండో చైర్మన్ సునీల్ కుమార్ అధ్యక్షతన మహాజన సభ జరిగింది. సంఘం కార్యకలాపాలు సంతృప్తికరంగా లేవని సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. విండో అవినీతిపై వచ్చిన ఆరోపణలు, డీసీవో విచారణ గురించి వివరంగా చెప్పాలని డిమాండ్ చేశారు. సభ మార్చిలోపు జరపాల్సి ఉండగా ఎందుకు జాప్యం చేశారని ప్రశ్నించారు. ఒక దశలో సభ్యుల వాదోపవాదాలతో సభలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తోపులాటకు దారి తీయటంతో పోలీసులు సభా స్థలికి చేరుకున్నారు. అనంతరం సభ సజావుగా జరిగింది. సంఘాభివృద్ధికి తీర్మానాలు చేశారు. విండో చైర్మన్ సునీల్ కుమార్ మాట్లాడుతూ...అవినీతి ఆరోపణలపై విచారణ కొనసాగుతోందని, పూర్తి కాగానే బాధ్యుల నుంచి రికవరీ చేస్తామన్నారు.

కొనుగోళ్లలో వేగం పెంచాలి



మాక్లూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్ల వేగం పెంచాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దుడ్డు గంగాధర్ కోరారు. మంగళవారం అమ్రాద్ సొసైటీ పరిధిలో ఉన్న కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. రైతుల ధాన్యం తరలించటంలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు. మరో 20 రోజుల్లో వర్షాకాలం ప్రారంభమవుతుందన్నారు. రైతులు వర్షాకాలం సీజన్‌కు సిద్ధం కావాల్సిన సమయంలో కూడా వరి ధాన్యం అమ్ముకోలేక రైతులు నేటికి కల్లాలపై పడిగాపులు కాసే పరిస్థితి ఏమిటని మండిపడ్డారు.

సమాచారం..

నేడు దివ్యాంగులకు బస్ పాసుల మేళా

రుద్రూర్: పోతంగల్ బస్టాండ్‌లో బుధవారం బోధన్ ఆర్టీసీ ఆధ్వర్యంలో దివ్యాంగుల బస్ పాస్ మేళా కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు బోధన్ ఆర్టీసీ డిపో మేనేజర్ టీఎన్ స్వామి తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి 10:30 వరకు మాత్రమే ఉంటుందన్నారు. దివ్యాంగులు పీహెచ్‌సీ కార్డు పొందడానికి సదరం సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ఒక పాస్ పోర్టు సైజ్ ఫొటో, రూ. 50 తీసుకొని రావాలని సూచించారు.

పరిసరాల శుభ్రతతో డెంగీ నివారణ



ఆర్మూర్ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్ అధికారులు



మోర్తాడ్‌లో..

నందిపేట/ఆర్మూర్‌టౌన్/మోర్తాడ్ : జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా డెంగీ వ్యాధి నివారణపై మంగళవారం స్థానిక పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ..రాబోయే వర్షాకాలంలో డెంగీ జ్వరాలు రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు తమ ఇంటి చుట్టూ, దాబా మీద వర్షపు నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా డబ్బాలు, పాత టైర్లు, కొబ్బరి బోండాలు, కుండలు, కూలర్లు, తదితర వాటిల్లో నీరు నిల్వ లేకుండా పారబోసి ఎండ బెట్టాలన్నారు. వీటిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహించారు.



నందిపేటలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్

మానవత్వం చాటిన న్యాయవాదికి సన్మానం



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని బార్ అసోసియేషన్‌లో మంగళవారం మానవత్వం చాటిన న్యాయవాది పెద్దోళ్ల దేవన్నను మంగళవారం న్యాయవాదులు శాలువాతో సన్మానించారు. నందిపేట్‌లోని రాంనగర్ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్న శబరి(60) అనే మహిళ ఆదివారం రాత్రి మృతి చెందగా మృతదేహాన్ని తన కుమారుడు ఉంటున్న అద్దె ఇంట్లోకి అనుమతించలేదు. దీంతో అదే కాలనీలో ఉంటున్న న్యాయవాది దేవన్న అంత్యక్రియలు ముగిసేంత వరకు తన ఇంటిని వాడుకునేందుకు అవకాశం ఇచ్చి మానత్వం చాటుకున్నారు. దీంతో బార్ అసోసియేషన్ సభ్యులు దేవన్నను అభినందించారు.

కంటి సమస్యల పరిష్కారానికే శిబిరాలు



కళ్లద్దాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

రుద్రూర్: కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించడానికి ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ నరోజి గంగారాం అన్నారు. చిక్కడపల్లిలో మంగళవారం ఎంపీపీ అక్కపల్లి సుజాతతో కల్సి కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ నెల 22 వరకు గ్రామంలో శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. అనంతరం పరీక్షలు చేయించుకున్నారు. సర్పంచ్ పుష్పలత, మాజీ సర్పంచ్ మచ్కూరి హన్మంతు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీపై అవగాహన



మాట్లాడుతున్న పశువైద్యాధికారి కిరణ్ దేశ్‌పాండే

మాక్లూర్: అడవి మామిడిపల్లి జీపీ భవనంలో మంగళవారం సర్పంచ్ చింత మల్లారెడ్డి అధ్యక్షతన మండల పశువైద్యాధికారి కిరణ్ దేశ్‌పాండే రెండో విడత గొర్రెల పంపిణీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నెలాఖరు నుంచి గొర్రెల పంపిణీ కార్యక్రమం ఉంటుందని, లబ్ధిదారులు తమ వాటా కింద చెల్లించాల్సిన రూ.43 వేల 750 నగదు వెంటనే చెల్లించాలన్నారు. సమయం దాటిన తరువాత గొర్రెలను అడిగితే ప్రయోజనం ఉండదన్నారు. గ్రామాల్లో ఉన్న కుర్మ, గొల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీటీసీ సత్యనారాయణ, పశువైద్యసిబ్బంది జైల్‌సింగ్, అహ్మద్‌పాషాలు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం



రెంజల్: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ, ఎంపీడీవోలు

రెంజల్(బోధన్): క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని ఎంపీపీ రజని అన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం సీఎం కప్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఎంపీడీవో శంకర్ ఉన్నారు.

మెండోరా మండల కేంద్రంలో..

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో సీఎం కప్ టోర్నమెంట్‌ను వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణ, జెడ్పీటీసీ గంగాధర్‌లు ప్రారంభించారు. డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

నందిపేటలో..

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం సీఎం కప్ క్రీడలు ప్రారంభమయ్యాయి. స్థానిక సర్పంచు సంబారు వాణి, జెడ్పీటీసీ ఎర్రం యమున పోటీలను ప్రారంభించారు. ఎంపీడీవో నాగవర్ధన్ ఉన్నారు.

వేల్పూర్‌లో ..

వేల్పూర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పోటీలను ఎంపీపీ బీమ జమున, మండల స్థాయి అధికారులు ప్రారంభించారు. తహసీల్దార్ రాజేందర్, ఎంపీడీవో కమలాకర్‌రావు, సర్పంచ్ తీగెల రాధామోహన్ పాల్గొన్నారు.

తడపాకల్‌లో..

మోర్తాడ్: ఏర్గట్ల మండలంలోని తడపాకల్‌లో పోటీలను మంగళవారం ఎంపీపీ కొలిప్యాక ఉపేంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు గుల్లె రాజేశ్వర్‌లు ప్రారంభించారు.ఎంపీటీసీ సభ్యుడు డాక్టర్ మధు, సర్పంచ్‌లు పత్తిరెడ్డి ప్రకాష్, లావణ్య, భానుప్రసాద్, ఎంపీడీవో రాజేశం, తహసీల్దార్ జనార్దన్ పాల్గొన్నారు.

డొంకేశ్వర్‌లో..

డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలో మంగళవారం సీఎం కప్ పోటీలు ప్రారంభమయ్యాయి. జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన ఈ పోటీలను ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ చాయచందుతో పాటు తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో నాగవర్ధన్, ఎంఈవో శ్రీనివాస్ రెడ్డిలు హాజరై ప్రారంభించారు. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షులు మోహన్ రెడ్డి, పీడీ సుదర్శన్, పీఈటీ బుచ్చన్న పాల్గొన్నారు.

రుద్రూర్ మండల కేంద్రంలో..

రుద్రూర్: మానసికంగా దృఢంగా ఉండటానికి క్రీడలు దోహదం పడుతాయని ఎంపీపీ అక్కపల్లి సుజాత, జెడ్పీటీసీ నరోజి గంగారాం అన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలో క్రీడా పోటీలను వారు ప్రారంభించారు. ఎంపీడీవో బాల గంగాధర్, ఎంఈవో శాంత కుమారి, సింగిల్ విండో మాజీ చైర్మన్ పత్తి రాము, తదితరులు పాల్గొన్నారు.

చందూర్ మండల కేంద్రంలో

చందూర్ మండల కేంద్రంలో క్రీడా పోటీలను ఎంపీపీ లావణ్యారాంరెడ్డి ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపుఓటమిలు సహజమని , ఓటమి చెందిన జట్టు నిరాశ పడకుండా మరింత పట్టుదలతో శ్రమించి విజయాన్ని అందకోవాలని సూచించారు. తహసీల్దార్ వసంత, ఎంపీడీవో నీలావతి, సింగిల్ విండో చైర్మన్ ప్యారం అశోక్, ఎంపీటీసీ శ్యాంరావ్ పాల్గొన్నారు.

బోధన్‌లో ముగిసిన పోటీలు



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీపీ సావిత్రి, ఆర్డీవో రాజేశ్వర్

బోధన్ రూరల్ (బోధన్): బోధన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. కల్దుర్కి సర్పంచ్ నానా పటేల్, ఎంపీడీవో తోట పర్బన్న, ఎంఈవో నాగ్ నాథ్ పాల్గొన్నారు.

23వ రోజుకు చేరిన వీవోఏల సమ్మె



ముప్కాల్‌లో నిరసన తెలుపుతున్న వీవోఏలు

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఐకేపీ వీవోఏలు చేపట్టిన సమ్మె మంగళవారానికి 23వ రోజుకు చేరింది. జిల్లా వ్యాప్తంగా సమ్మె కొనసాగింది. ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. వీవోఏల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని ఈ సందర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఆర్మూర్‌టౌన్: అంబేద్కర్ చౌరస్తా వద్ద బతుకమ్మ ఆడుతూ నిరసన తెలుపుతున్న వీవోఏలు



వర్నిలో..

'ఆర్టీసీలో యూనియన్లను ప్రారంభించాలి'



ధర్నా నిర్వహిస్తున్న యూనియన్ ప్రతినిధులు

ఆర్మూర్: హైకోర్టు ఆదేశానుసారం ఆర్టీసీలో యూనియన్లను ప్రారంభించి గుర్తింపు సంఘం ఎలక్షన్లను నిర్వహించాలని ఆర్మూర్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రవిచందర్, అర్గుల్ రమేష్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ ఆర్టీసీ డిపో ప్రాంగణం ఎదుట యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ధర్నాలో ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు సీసీఎస్ ప్రసాద్, డీసీ గోపి, భూమన్న, లక్ష్మణ్, గంగాధర్ స్వామి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దేవ గాండ్ల సంఘం మండలాధ్యక్షుడి నియామకం



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల దేవ గాండ్ల సంఘం మండలాధ్యక్షుడిగా గాండ్ల రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. మంగళవారం కమ్మర్‌పల్లిలో దేవగాండ్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సుంకాజి రవిరాజ్, కోశాధికారిగా రవీందర్, ప్రధాన సలహాదారుడిగా గాండ్ల సాంబయ్య, గాండ్ల శ్రీనివాస్, శివ, రాములును ఎన్నుకున్నారు. గాండ్ల తేలి కుల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కమలాకర్ పాల్గొన్నారు.